క్లుప్తంగా

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



కొడంగల్ రూరల్: హిందీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీచర్లు

కొడంగల్ రూరల్: మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయులు చంద్రకళబాయి, లక్ష్మిలను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. హిందీ పండితులు మాట్లాడుతూ.. 1949 సెప్టెంబర్ 14 తేదీ నుంచి భారత ప్రభుత్వం హిందీ భాషను దేశ భాషగా గుర్తించిందన్నారు. మాతృ భాష తెలుగుకు మొదటి ప్రాధాన్యతను ఇస్తూ హిందీని నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

కుల్కచర్ల: దేశంలో అత్యధిక మంది మాట్లాడేది హిందీ భాష అని ఎంఈఓ హబీబ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో హిందీ పండిట్ చందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

‘ఫార్మా’ రద్దుకు పోరు ఉధృతం



రిలే నిరాహార దీక్షలో భూ బాధితులు

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేటలో ఫార్మా భూ బాధితులు ‘గో బ్యాక్ ఫార్మా అంటూ’ రిలే నిరాహార దీక్షలు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్న మా పొలాల్లో ప్రమాదకరమైన ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయడం తగదన్నారు. హకీంపేట, లగచెర్ల, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్ల తండాల రైతులు ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయొద్దని కొంత కాలంగా ఆందోళనలు చేస్తున్నా.. ప్రభుత్వం నుంచి సమాధానం కరువైందన్నారు. దీంతో రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు వారు తెలిపారు. దీక్షలో రైతులు బసప్ప, రాఘవేందర్, రమేశ్, వెంకటయ్య, నరేశ్, రాంనాయక్, బుగ్గప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తపస్ మండల కమిటీ ఎన్నిక




నూతనంగా ఎన్నికైన సభ్యులు

కుల్కచర్ల: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) చౌడాపూర్ మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మరికల్ గ్రామంలో తపస్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అందులో కమిటీ నూతన అధ్యక్షుడిగా మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా మల్లయ్య, కోశాధికారి విజయ్‌కుమార్, మహిళ అధ్యక్షురాలిగా మంజులత, ఉపాధ్యక్షులుగా యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, మహిళ కార్యదర్శులుగా సుమలత, బాలమణి, మీడియా ఇన్‌చార్జిగా శ్రీను తదితరులు ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బాలుగౌడ్, గోపాల్, మాణిక్యం, మౌనిక, సౌజన్య, దివ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కుల్కచర్ల: విద్యార్థులు క్రీడల్లో రాణించడంతో మానసిక శక్తి మెరుగు పడుతుందని పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఖోఖో శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో పీఈటీ సుభాశ్ నాయక్, శ్రీకృష్ణ, శ్రీనివాస్, రఘు, సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంల అందజేత



పెద్దేముల్: చదువు ఉంటేనే సమాజంలో గుర్తింపు ఉంటుందని హెచ్‌ఎం అనిల్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఖానాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు రెండో విడత యూనిఫాం పంపిణీ చేశారు. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలను చదివించాలని సూచించారు.



ఆస్పత్రి ఆవరణలో కూలిన ప్రహరీ



కేజీబీవీ ప్రహరీపై కోతుల హంగామా

అపరిశుభ్రం.. అవస్థలమయం!

- ప్రభుత్వ కార్యాలయాల్లో పాములు, కోతుల సంచారం
- భయాందోళనలో ఉద్యోగులు, విద్యార్థినులు

ధారూరు: అపరిశుభ్ర వాతావరణంతో ప్రభుత్వ కార్యాలయ భవనాలు పాములు, కోతులకు నెలవులుగా మారాయి. మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రం, ప్రాథమిక ఆస్పత్రి, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఈ సమస్య అధికంగా ఉంది. దీంతో ఉద్యోగులు, విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. దాదాపు 2 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలు, గడ్డి విపరీతంగా పెరిగి విషసర్పాలకు స్థావరంగా మారింది. తరచూ కేజీబీవీలో ప్రవేశిస్తున్న పాములను పట్టివేసి దూరంగా వదిలివేస్తున్నారు. దీంతో విద్యార్థినులు భీతిల్లుతున్నారు. రాత్రిళ్లు సైతం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని బాలికలు ఆవేదన చెందుతున్నారు. గతంలో అనేకసార్లు సర్పాలు కేజీబీవీలో సంచరించిన ఘటనలున్నాయి.

విజృంభిస్తున్న మర్కటాలు

మరోపక్క వందలాదిగా ఉన్న కోతులు ఆస్పత్రి, కేజీబీవీ, ఎంఈఓ కార్యాలయాలపైన ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులను ధ్వంసం చేస్తున్నాయి. కేజీబీవీ భవనంపై ఉతికి ఆరబెట్టిన విద్యార్థినుల దుస్తులను చింపేయడం, దూరంగా ఎత్తుకెళ్లి విసిరివేస్తున్నాయని బాలికలు వాపోతున్నారు. ఆస్పత్రి ప్రాంగణం నుంచి కేజీబీవీలోకి చేరుతున్న కోతులు పండ్లు, కూరగాయలు, వండిన ఆహార పదార్థాలను పాడు చేస్తున్నాయి. అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే భయపెట్టి మరీ హంగామా సృష్టిస్తున్నాయి. వీటికి ఆస్పత్రి ఆవరణలో పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలే కారణమంటూ స్థానికులు వాపోతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

ఆస్పత్రిలో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. చింతకుంట గ్రామానికి వెళ్లే దారి పక్కనే ఉన్న ఆస్పత్రి ప్రహరీని కొంతభాగం కూలగొట్టిన దుండగులు రాత్రిళ్లు అందులోకి ప్రవేశించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయం తెలిసినా ఆస్పత్రి సిబ్బంది ఏం చేయలేరని దుండగులు భావిస్తున్నట్లు సమాచారం. దీనిపై శాసనసభ స్పీకర్, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలని కేజీబీవీ, ఆస్పత్రి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది వేడుకుంటున్నారు.

ఏచూరి ఆశయసాధనకు కృషి



పరిగి: ఏచూరి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు



అనంతగిరి: వికారాబాద్ సీపీఎం కార్యాలయంలో నేతల నివాళి



తాండూరు టౌన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద..

అనంతగిరి/పరిగి/తాండూరు టౌన్: సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని వామపక్ష పార్టీల నేతలు విషాద హృదయంతో పేర్కొన్నారు. ఆయన చేసిన ప్రజా పోరాటాల ఫలితంగా కార్మిక, కర్షక, బడుగుల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. అనారోగ్యంతో ఆయన మృతి చెందడంతో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వివిధ కూడళ్ల వద్ద చిత్రపటానికి నివాళులర్పించారు. జోహార్ కామ్రేడ్ అంటూ నినాదాలు చేసి, సీతారాం ఏచూరి సేవలను స్మరించుకున్నారు.

బాల్యం నుంచే దేశభక్తిని పెంపొందించాలి

ధారూరు: బాల్యదశ నుంచే చిన్నారులకు వ్యక్తిత్వ విలువలు, దేశభక్తిని పెంపొందించాలని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్.జనార్దన్, కవయిత్రీ మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షుడు కేవీఎం వెంకట్ కోరారు. వారు మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం విద్యార్థినులకు లైఫ్ స్కిల్స్, టైం మేనేజ్‌మెంట్, గోల్ సెట్టింగ్‌తో పాటు దేశభక్తిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న జనార్దన్

సంక్షిప్త వార్తలు

ఓటరు జాబితాను సరి చూసుకోండి



దుద్యాల్: ఓటరు జాబితాలో కుటుంబ సభ్యులందరూ ఒకే దగ్గర ఉన్నారా లేరా అనే వివరాలను పరిశీలించుకోవాలని మండల పరిధిలోని హస్నాబాద్ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఓటర్ల వివరాలతో కూడిన ప్రతులు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక కుటుంబానికి సంబంధించిన అందరి వివరాలు ఒకే దగ్గర ఉండాలని, లేని పక్షంలో రాత పూర్వకమైన ఫిర్యాదు చేయాలని సూచించారు.

పశుసంవర్ధకశాఖ అధికారిని కలిసిన నేతలు

ధారూరు: జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వి.సదానందంను శుక్రవారం జిల్లా ఔట్ సోర్సింగ్ ఎంప్లాయూస్ యూనియన్ నాయకులు కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో బాబురావు, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

పెద్దేముల్: గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను శుక్రవారం పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జర్నప్ప, ఎంపీఓ రతన్‌సింగ్‌లు విడుదల చేశారు. మండలంలోని 38 గ్రామ పంచాయతీల వారీగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. 2019లో నిర్వహించిన పంచాయతి ఎన్నికల్లో 35వేలకు పైగా ఓటర్లు ఉన్నాయన్నారు. జాబితాలపై అభ్యంతారాలు ఉంటే శనివారం నుంచి ఈ నెల 21 వరకు ఎంపీడీఓ కార్యాలయంలో తెలిపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పరిగి: గ్రామాన్ని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ) కరీం సూచించారు. శుక్రవారం సయ్యాద్‌పల్లి గ్రామంలో పంచాయితీ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ప్రచురించారు. అనంతరం పంచాయితీ రికార్డులను పరిశీలించి, నర్సరీల నిర్వహణ, పారిశుధ్య పనులను, అమ్మ ఆదర్శ పాఠశాలలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో వీధుల గుండా ఉన్న పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాం రెడ్డి, మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకులే పార్టీకి వెన్నెముక

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీకి యువకులే వెన్నెముక అని పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప అన్నారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్‌కుమార్, మండల అభ్యర్థి సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం గౌతపూర్‌లో సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 18 నుంచి 35 ఏళ్ల యువతి, యువకులు పార్టీ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీనివాస్‌గౌడ్, హరికృష్ణ, అజ్మత్, శ్రీనివాస్, వెంకటేష్, రాములు, రాజు, వెంకటేష్ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

యాలాల: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ పార్వతాలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దేవనూరు పాఠశాలలో వైఆర్‌జీకేర్ లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, సుఖరోగాలతో వ్యాప్తి చెందుతుందన్నారు. ఎయిడ్స్‌కి మందులేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. ఎయిడ్స్ సోకిన వ్యక్తితో కలిసి భోజనం చేయడం, కలిసి ఉండటం వల్ల సోకదన్నారు. కార్యక్రమంలో స్కీం జోనల్ సూపర్‌వైజర్ రాములు, ఎస్‌టీఐ కౌన్సిలర్ కుమార్, ఎస్ఎస్‌కే మేనేజర్ కృష్ణవేణి, శేఖర్, నరేందర్, ప్రకాష్, అనంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

తాండూరు రూరల్: పాఠశాలల విషయంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించొద్దని ఎంఈఓ వెంకటయ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కరన్‌కోట్, వడ్డెరబస్తీ, ఓగిపూర్, బెల్కటూర్, గౌతపూర్ గ్రామాల్లో పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలు తిరుగుతూ ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మట్లాడి చదవడం, రాయడంపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. సమాచారం ఇవ్వకుండా ఉపాధ్యాయులు పాఠశాలలకు సెలవు పెట్టొద్దని హెచ్చరించారు. ప్రార్థన సమయంలో అందరూ ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

జీపీల్లో ఓటరు జాబితాలు

మోమిన్‌పేట: గ్రామ పంచాయతీలలో ఓటరుల జాబితాను నోటీస్ బోర్డులపై ఉంచామని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామ పంచాయతీల ఓటరుల జాబితాను బోర్డుపై ఉంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలతో పాటు మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాలకు సంబంధించిన ఓటరుల జాబితాను ఉంచామన్నారు. ఎవైనా తప్పులు ఉండే సవరణలకు సమయం ఇచ్చామన్నారు. తుది జాబితా ప్రకటనలకు ముందే ప్రతిఒక్కరూ సవరణలు చేసుకోవాలన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి



బంట్వారం: కేంద్ర ప్రభుత్వం మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరళారెడ్డి తెలిపారు. 2023–24 సంవత్సరానికి గానూ 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం ఆమె ఆదర్శ పాఠశాలలో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్కిల్ హబ్ మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేశారని, వీరందరికి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. రెండో బ్యాచ్ కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ జ్యోతి, శిక్షణ పొందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఫ్యాన్ల పంపిణీ

పెద్దేముల్: మండలంలోని 39 అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్‌లు, ట్యూబ్ లైట్లు మంజురయ్యాయని ఎంపీడీఓ జర్నప్ప తెలిపారు. వాటిని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం మండల పరిషత్‌లో అందజేశారు. మండలంలో మొత్తం 56 అంగన్‌వాడీ కేంద్రాలుండగా ప్రభుత్వ భవనం ఉన్నా అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే ఓ ఫ్యాన్, ఓ ట్యూబ్ లైటు మంజురైందన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ఫ్యాన్‌లు, ట్యూబ్ లైట్లు బిగించకుండా పక్కదారి పట్టినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆత్మూర్, సిద్దన్న మడుగుతండా పంచాయతీ కార్యదర్శులు అర్చన, అరుణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదలకు వరం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: ప్రభుత్వం ఇస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చెక్కులతో ఎంతో మంది పేదలకు మేలు జరుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో ఆర్థికంగా ఉన్న వాళ్లకు పెద్దగా ప్రయోజనం లేకపోయినా చిన్న, సన్నకారు రైతులు, కూలీలు, పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీనిని సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, తహసీల్దార్ జయరాం, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

సమన్వయంతో పని చేయండి

జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ జ్ఞానేశ్వర్

కొడంగల్ రూరల్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో మండలంలో 1,882 మంది రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 1,376 మందికి మాత్రమే మాఫీ జరిగిందన్నారు. మిగతా వారికి వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉందని ఇన్‌చార్జ్ ఏఓ లావణ్య తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు 183 మంది రైతులకు సంబంధించి 191 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. పశువైద్యాధికారి డాక్టర్ పరమేశ్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని తెలిపారు. ఫెన్సింగ్ లేని కారణంగా మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కావడంతో అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

రచ్చకట్ట తండాను జీపీగా మార్చండి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తూ...

పెద్దేముల్: మండలంలోని రచ్చకట్టతండాను నూతన గ్రామ పంచాయతీగా మార్చాలని తండావాసులు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జైరాంతండా(తట్టెపల్లి) గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామంగా రచ్చకట్టతండా కొనసాగుతుందన్నారు. జనాభా ప్రకారం ప్రభుత్వం వెంటనే కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని తండావాసులు సునీల్ కుమార్, లక్ష్మణ్, అశోక్‌రాథోడ్, మోహన్, చందర్, విజయకుమార్, మోహన్‌సింగ్, రాంకిషోర్‌తో పాటు తదితరులు అడిషనల్ కలెక్టర్ సుధీర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ)ని కలిసి వినతిపత్రం అందజేశారు.

కొనసాగుతున్న గణపయ్య పూజలు



అనంతగిరి: వికారాబాద్‌లో గణేశ్ మండపం వద్ద ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

అనంతగిరి: వికారాబాద్‌లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు వినాయకులను నిమజ్జనం చేశారు. వినాయకుడి ముందు ఆటపాటలతో యువత ఎంజాయ్ చేస్తూ ముందుకు సాగారు.



వికారాబాద్ నిమజ్జనోత్సవంలో..



వికారాబాద్‌లోని బీటీఎస్ కాలనీలో పూజలందుకున్న గణనాథుడి వద్ద మహిళలు



దుద్యాల్: నిమజ్జన వేడుకలో మహిళల నృత్యాలు

రైతులకు పంట రుణాలు

బొంరాస్‌పేట: సహకార బ్యాంకులో తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించిన రైతులకు నెల 18 నుంచి అధిక పరిమితిలో లోన్‌లు అందివ్వనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో మెట్లకుంట పీఏసీఏస్‌ను కొడంగల్ బ్యాంకు మేనేజర్ ప్రభాకర్, జిల్లా ఆడిటర్ దయాకర్‌రెడ్డి, సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి సందర్శించారు. రికార్డులు, బ్యాంకు నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి రైతులకు ఎక్కువ రుణాలు అందిస్తామన్నారు. మార్టిగేషన్‌కు ఎకరాకు రూ.4లక్షల చొప్పున రుణం ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ



శిథిల భవనం.. గ్రామస్తుల భయం

పూడూరు: శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని మిట్టకంకల్ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం పాత భవనం పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో గతంలోనే విద్యార్థులను నూతన భవనంలోకి తరలించారు. అయినా చిన్నారులు విరామం, ఆటలు ఆడుకునే సమయంలో శిథిలావస్థ భవనంలోకి వెళుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనాన్ని వెంటనే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.